# రాష్ట్రానికే తలమానికం చంద్లాపూర్

- పర్యాటక కేంద్రంగా రంగనాయకసాగర్
- చిన్నకోడూరు మండలంలో 481 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు
- సాధారణ సర్వసభ్య సామావేశంలో జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ

చిన్నకోడూరు, అక్టోబర్ 5: రంగనాయక సాగర్ నిర్మాణంతో చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామం బెస్ట్ టూరిజం విలేజ్‌గా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 3 నెలల్లో జరిగిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు కృషితో రూ.125 కోట్లతో రంగనాయక సాగర్ పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. రాష్ట్రానికే చంద్లాపూర్ తలమానికంగా మారనుందన్నారు. దూరప్రాంతాల నుంచి పర్యాటకులు రంగనాయకసాగర్‌ను సందర్శించేందుకు తరలివస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందున్నదన్నారు. రైతు బీమా పథకంలో 35 మంది రైతులకు రూ.10 కోట్లు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ అయినట్లు చెప్పారు. మండలంలో వరి 1,971 ఎకరాలు, మొక్కజొన్న 3,900, ఆయిల్ పామ్ 481 ఎకరాల్లో సాగు చేస్తున్నారని వివరించారు.

**అద్భుతంగా వెయ్యి పడకల దవాఖాన**

మంత్రి హరీశ్‌రావు కృషితో సిద్దిపేటలో వెయ్యి పడకల దవాఖాన అద్భుతంగా సేవలందిస్తున్నదని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అన్నారు. కార్పొరేట్ దవాఖానలను తలదన్నేలా నిర్మించారన్నారు. వైద్యం కోసం హైదరాబాద్ పోవాల్సిన పని లేదన్నారు. అన్ని సౌకర్యాలతో సర్కారు వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు, యువతకు క్రికెట్ కిట్లు, టీ షర్టులు పంపిణీ చేశారు. ఇంటింటికీ మూడు ఎల్ఈడీ లైట్లను అందించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అందజేశారు. సమావేశంలో డీసీసీబీ జిల్లా డైరెక్టర్ రాంచంద్రం, రైతుబంధు మండల అధ్యక్షుడు పరకాల మల్లేశం, సొసైటీ చైర్మన్ సదానందం గౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సోమిరెడ్డి, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.


సమావేశానికి హాజరైన సభ్యులు


చీరలు పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీ


అభివృద్ధి పనులపై మాట్లాడుతున్న ఎంపీపీ మాణిక్యరెడ్డి

## మెరిసిన పుల్లూరు ఆణిముత్యాలు

పోలీస్ నియామక ఫలితాల్లో ఆరుగురికి ఉద్యోగాలు


రమేశ్‌యాదవ్


అజయ్‌రెడ్డి


ప్రవీణ్


మంద విజయ్


కృష్ణప్రసాద్ రెడ్డి


ప్రియాంక

సిద్దిపేటరూరల్, అక్టోబర్ 5: సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన ఆణిముత్యాలు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ నియామక తుది ఫలితాల్లో ఆరుగురు ఉద్యోగాలు సాధించారు. గురువారం ఫలితాలు వెల్లడయ్యాయి. దీంతో గ్రామంలో, ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాల్లో ఆనందోత్సాహం నెలకొంది. పుల్లూరు గ్రామానికి చెందిన కసిరవేని రమేశ్‌యాదవ్ ప్రస్తుతం ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. గతంలో గ్రేహౌండ్స్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. మిగతా ఐదుగురు గడ్డం అజయ్‌రెడ్డి, తత్తరి ప్రవీణ్‌కుమార్, మంద విజయ్, సంకటి ప్రియాంక, ఐరిని కృష్ణ ప్రసాద్‌రెడ్డి తాజాగా పోలీసు ఉద్యోగాలు సాధించారు. ఇందులో అజయ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కృష్ణ ప్రసాద్‌రెడ్డి టీఎస్ఎస్‌పీ కానిస్టేబుళ్లుగా, మంద విజయ్ సివిల్ కానిస్టేబుల్‌గా, ప్రియాంక ఏఆర్‌కు ఎంపికయ్యారు. సర్పంచ్ పల్లె నరేశ్‌గౌడ్ వీరిని అభినందించారు.


## 'ఎస్సీ స్టడీ సర్కిల్' ప్రభంజనం

కానిస్టేబుల్ ఫలితాల్లో 40 మందికి ఉద్యోగాలు


అభ్యర్థులను సన్మానించిన ఎస్సీ స్టడీసర్కిల్ డైరెక్టర్ శ్రీకాంత్

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 5: ప్రభుత్వం వెలువరించిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో సిద్దిపేట టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన 40 మంది అభ్యర్థులు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకొని ఉద్యోగం సాధించిన అభ్యర్థులను గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కుమార్, మహేందర్, సుధాకర్, సౌఖ్య, మల్లేశం, స్వామి ఉన్నారు.

## పీఆర్సీ ఏర్పాటు హర్షణీయం


మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 5: ఉద్యోగులకు పీఆర్సీ ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి పర్వతరెడ్డి, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్, రంగారావు, శ్రీధర్, రవీందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు గురువారం ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రిని కలిసిన ట్రస్మా నాయకులు


మంత్రికి వేంకటేశ్వర ప్రతిమను అందజేస్తున్న నాయకులు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 5: జిల్లా కేంద్రం సిద్దిపేటలో ఇటీవల కొండ భూదేవి గార్డెన్‌లో జరిగిన ట్రస్మా ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హరీశ్‌రావు హాజరై ఉపాధ్యాయులపై వరాలు కురిపించారని ట్రస్మా సంఘం జిల్లా అధ్యక్షుడు జగ్గు మల్లారెడ్డి అన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు రూ.5 లక్షల బీమా, ఉపాధ్యాయుల సౌకర్యార్థం ఫంక్షన్ హాల్ కేటాయించారన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమాన్ని కాంక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావును గురువారం క్యాంప్ కార్యాలయంలో ట్రస్మా నాయకులు కలిసి కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంపత్‌కుమార్, భగవాన్‌రెడ్డి, సత్యం, రమేశ్ తదితరులు ఉన్నారు.

# ప్రతి మహిళకూ బతుకమ్మ చీర

**మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు**


బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న మంజులారాజనర్సు

సిద్దిపేట, అక్టోబర్ 5: తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏడాది బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బతుకమ్మ కానుకగా అందించే చీరలను 18 ఏండ్లు నిండిన ప్రతి ఆడపడుచుకు అందిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అన్నారు. మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు గురువారం సిద్దిపేట పట్టణంలోని 4, 24, 25వ వార్డుల్లో మహిళలకు వార్డు కౌన్సిలర్లు కొండం కవితాసంపత్ రెడ్డి, గుండ్ల యోగేశ్వర్‌తో కలిసి బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు ఘనంగా జరుపుకునే పూల పండుగకు ప్రతి ఏటా ప్రభుత్వం ఆడపడుచులకు బతుకమ్మ చీరలను కానుకగా అందిస్తున్నదన్నారు. రాష్ట్రంలోని మరమగ్గ నేతన్నలకు ఉపాధి కల్పించటంతోపాటు ఆడపడుచులకు ప్రేమపూర్వక చిరుకానుక అందించే ఉద్దేశంతో 2017లో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం 10 రకాల రంగుల్లో 25 విభిన్న డిజైన్లతో 240 వెరైటీలతో చీరలు తయారు చేసినట్లు చెప్పారు. ఆహార భద్రత కార్డు ఉన్న ప్రతి మహిళకు బతుకమ్మ కానుక అందుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు శ్రీలత, రజిత, అంగన్వాడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్య పరిరక్షణకే 'రుతుప్రేమ'

సిద్దిపేట, అక్టోబర్ 5: మహిళల ఆరోగ్య పరిరక్షణకు రుతుప్రేమ కార్యక్రమం చేపట్టినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు అన్నారు. శుక్రవారం మంత్రి హరీశ్ రావు ఆదేశాల మేరకు సిద్దిపేట పట్టణంలోని 19, 21, 29, 30 వార్డుల్లో వార్డు కౌన్సిలర్లు గ్యాదరి రవి, నజియా తబస్సుమ్ అత్తర్‌పటేల్, ఫాతిమా బేగంవజీర్, అర్షద్, డాక్టర్ శాంతితో కలిసి మహిళకు రుతుస్రావ కప్పులు, బట్ట ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి సరోజన, డీపీవో దేవకీదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధవి, మెప్మా అధికారులు, సాయికృష్ణ, రమ్య ఉన్నారు.



ఋతుస్రావ కప్పులు, బట్ట ప్యాడ్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు

## మహిళలకు ప్రాధాన్యం లేదా?



ఢిల్లీలో ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ

గజ్వేల్, అక్టోబర్ 5: దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు గోవులకిస్తున్న ప్రాధాన్యం మహిళలకు ఇవ్వడంలేదని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండ స్వామి ఆరోపించారు. గురువారం ఐద్వా ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ధర్నాకు ఆయన సంఘీభావం ప్రకటించారు. గోవులను తరలిస్తున్నారనే కారణంతో అమాయకుల ప్రాణాలు తీస్తున్న హిందుత్వ శక్తులు.. దేశంలో మహిళలపై దాడులు జరుగుతుంటే ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. ర్యాలీలో డీబీఎఫ్ నాయకులు చంచు రాజేందర్, దుబాష్ సంజీవ్, వేణు పాల్గొన్నారు.

## వాహనదారులు హెల్మెట్ ధరించాలి

మిరుదొడ్డి, అక్టోబర్ 5: వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి కోరారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సొంత ఖర్చులతో గురువారం గ్రామానికి చెందిన 126 మంది యువకులకు లెర్నింగ్ లైసెన్స్‌తోపాటు హెల్మెట్లు అందజేశారు. సర్పంచ్ కిష్టయ్య, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ అహ్మద్, ఉపసర్పంచ్ దిలీప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మల్లయ్య, రాజయ్య, జావిద్, నవీన్, నితిన్, ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.